సరూర్‌నగర్ చెరువులో నీటిని శుద్ధి చేస్తాం

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

ఎల్బీనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువులో ఎస్టీపీని పునరుద్ధరించి నీటిని శుద్ధి చేస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, రోడ్లు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం వాకర్స్‌తో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియదర్శిని పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

దిల్‌సుఖ్‌నగర్: మల్కాజిగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ శుక్రవారం గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోణార్క్ థియేటర్ వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఫ్లోర్‌లీడర్ బద్దుల వెంకటేశ్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ కందికంటి ప్రేమ్‌నాథ్‌గౌడ్, వేణుగోపాల్‌యాదవ్, శాలిని, శ్రీధర్‌గౌడ్, దయానంద్, శ్రవణ్, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్ వరకు మెట్రో విస్తరణతో మారనున్న ఎల్బీనగర్ ముఖచిత్రం

వనస్థలిపురం: హయత్‌నగర్ వరకు మెట్రో విస్తరణతో ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధి ముఖచిత్రం మారనుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం డివిజన్ల కాలనీ సంక్షేమ సంఘాలు, కాంగ్రెస్ నాయకులతో ఆత్మీయ సమ్మేళనాన్ని వనస్థలిపురంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డితో కలిసి మధుయాష్కీగౌడ్ పాల్గొన్నారు. మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ మూసీ పరీవాహక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు, నగర శివారు ప్రాంతాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తుందన్నారు. సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా వరకు వరదనీటి సమస్యలున్నాయని, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల నుంచి వచ్చే వరద నీటి సమస్యకు ప్రత్యేక డ్రైన్లు నిర్మించి మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. తనను గెలిపిస్తే కేంద్ర నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, గజ్జి భాస్కర్‌యాదవ్, నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, కార్పొరేటర్ సుజాతనాయక్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, మాజీ కౌన్సిలర్ ఉమాశ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్, మకుటం సదాశివుడు, శశిధర్‌రెడ్డి, రామారావు, స్వర్ణమాధవి, విద్యారెడ్డి, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

భావి చిత్రకారులకు మార్గదర్శి అంబాజీ

● ప్రముఖ కవి, రచయిత ఏనుగు నర్సింహారెడ్డి



అంబాజీకి విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఇనాక్ తదితరులు

హైదరాబాద్ సిటీ/కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జీవం ఉట్టిపడేలా చిత్రాలను గీసే అంతర్జాతీయ చిత్రకారుడు అంబాజీ భవిష్యత్ తరాలకు మార్గదర్శి అని ప్రముఖ కవి, రచయిత ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. చిన్నతనంలోనే పాఠశాలలో రాముడు అని రాయమంటే శ్రీరాముడి చిత్రపటాన్ని పలకపై చిత్రించారని ప్రశంసించారు. తెలుగు విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బాచుపల్లి ప్రాంగణంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అంబాజీకి అంతర్జాతీయ విశిష్ట పురస్కారం, రూ.లక్ష చెక్కును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, కళలకు ఈ విశ్వవిద్యాలయం చిహ్నంగా నిలిచిందన్నారు. అంబాజీ చిత్రకళలో ద్రోణుడు లేని ఏకలవ్యుడిగా నిలిచారని తెలుగు యూనివర్సిటీ వీసీ కిషన్‌రావు అన్నారు. రిజిస్ట్రార్ రమేశ్ భట్టు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ చిత్రలేఖనం విద్యార్థులు అంబాజీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.


పురస్కారగ్రహీతలతో అతిథులు

ఆర్టీసీ ప్రగతిలో డ్రైవర్ల పాత్ర కీలకం

రవీంద్రభారతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రగతిలో డ్రైవర్ల పాత్ర కీలకమని గ్రేటర్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉత్తమ డ్రైవర్లకు సత్కారం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీఎస్ఆర్టీసీ దేశంలోనే నంబర్‌వన్‌గా కొనసాగుతోందన్నారు. ప్రమాదాల విషయంలో కూడా అతి తక్కువ రేటును నమోదు చేసుకుందని తెలిపారు. డ్రైవర్‌గా పనిచేస్తూ తోటి డ్రైవర్ల సేవలను గుర్తించి పురస్కారాలు ప్రదానం చేయడం రాములు గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు, ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖుస్రోషాఖాన్, టీఎస్ రావు, కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రామ్మోహన్, దాసరి దయానంద్ రెడ్డి, తేజ, తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న డాక్టర్ హిమాన్షుపాఠక్ తదితరులు

దేశంలో మరో 114 కృషి విజ్ఞాన కేంద్రాలు

● ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షుపాఠక్

రాజేంద్రనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో మరో 114 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ ప్రకటించారు. తెలంగాణలోని కృషి విజ్ఞాన కేంద్రాలు 2024-25లో అమలు చేయాల్సిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక గురించి చర్చించేందుకు రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సదస్సును శుక్రవారం ఆయన రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో ప్రారంభించారు. ఈ సదస్సును ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐసీఏఆర్ అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(అటారీ) 10వ జోన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. తద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి, నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ వి.సుధారాణి, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ విజయ, పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ మహేందర్, విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు, కేవీకేల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు. కాగా, ఐసీఏఆర్‌లో ఉద్యోగంలో చేరిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్లు ఐసీఏఆర్ బలోపేతానికి కృషి చేయాలని డాక్టర్ హిమాన్షు పాఠక్ సూచించారు.

క్వాలిటీ ఎడ్యుకేషన్‌కు 'శివ్‌నాడార్' ది బెస్ట్

● 95 శాతం విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్


మాట్లాడుతున్న డాక్టర్ రాజీవ్‌కుమార్‌సింగ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాలు పొందాలనుకునే విద్యార్థులు, తల్లిదండ్రుల ఆకాంక్షలను ఢిల్లీలోని శివ్‌నాడార్ విశ్వవిద్యాలయం(ఎస్ఎన్‌యూ) తప్పకుండా నెరవేరుస్తుందని అడ్మిషన్స్ చైర్‌పర్సన్ డాక్టర్ రాజీవ్ కుమార్‌సింగ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శివనాడార్ యూనివర్సిటీ ప్రత్యేకతలు, అడ్మిషన్ల విధానం, గతేడాది సాధించిన ఫలితాల గురించి వివరించారు. యూనివర్సిటీలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, నాచురల్ సైన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగాలు(స్కూల్స్) ఉన్నాయని, విలువలు, నైతికత, నాయకత్వ లక్షణాలతోపాటు బహుళ విభాగాల(మల్టీ డిసిప్లినరీ) విధానంతో అంతర్జాతీయస్థాయి విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎడ్యుకేషన్, ప్లేస్‌మెంట్స్ మధ్య రిలేషన్‌ను విద్యార్థులు అర్థం చేసుకునేలా శిక్షణ ఇచ్చేందుకు కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి యేటా 95 శాతం మంది విద్యార్థులకు(గరిష్టంగా రూ.58 లక్షలు, సగటున రూ.11 లక్షల ప్యాకేజీలతో) ప్లేస్‌మెంట్స్ వస్తున్నాయని చెప్పారు. అడ్మిషన్ల విధానం, ఫీజులు, ఇతర వివరాలకు శివ్‌నాడార్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు.

టెన్నిస్ రన్నరప్ వేమూరి అభయ



ఆకాంక్షకు ట్రోఫీ బహూకరిస్తున్న రామారావు, చాముండేశ్వర్‌నాథ్ తదితరులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఎఫ్ఎన్‌సీసీ జాతీయ మహిళల టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి వేమూరి అభయ రన్నరప్‌గా నిలవగా, ఆకాంక్ష(మహారాష్ట్ర) టైటిల్ కైవసం చేసుకుంది. శుక్రవారం ఫిలింనగర్‌లోని ఎఫ్ఎన్‌సీసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఫైనల్లో ఆకాంక్ష 6-4, 6-3తో అభయపై నెగ్గి, విజేతగా నిలిచింది. సినీనిర్మాత కేఎస్ రామారావు, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్ కలిసి ఆకాంక్షకు ట్రోఫీ బహూకరించారు. ముగింపు వేడుకకు అతిథిగా విచ్చేసిన స్టార్ షెట్లర్ సాత్విక్ సాయిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చాముండేశ్వర్‌నాథ్ మాట్లాడుతూ జూలై-ఆగస్టులో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌లో సాత్విక్ పతకం సాధిస్తే బీఎండబ్ల్యూ కారును కానుకగా ఇస్తానని ప్రకటించారు.

దేశం కోసం ధర్మం కోసం బీజేపీ గెలవాల్సిందే

● మచ్చలేని 'కొండా'ను ఆదరించండి
● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల

సరూర్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): దేశం కోసం, ధర్మం కోసం మరోసారి కేంద్రంలో బీజేపీ సర్కార్ కొలువుదీరాల్సిందేనని, ఈ దృష్ట్యా తెలంగాణలోని మెజారిటీ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉన్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న తమ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఓటర్లు ఆదరించి ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. కొండాకు మద్దతుగా శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు పార్టీ కరపత్రాలు పంపిణీ చేస్తూ అవినీతి, కుంభకోణాల మచ్చలేని మంచి మనిషి 'కొండా'ను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఆ పార్టీకి వేసే ఓటు వృథాయేనని ఆయన అన్నారు. ఇక కాంగ్రెస్ ను సైతం ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆయన వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో బీజేపీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు మద్ది సబితారాజశేఖర్‌రెడ్డి, కీసరి హరినాథ్‌రెడ్డి, పసునూరి భిక్షపతిచారి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, కెసోమేశ్వర్, నాయకులు సూల ప్రభాకర్, యాదగిరియాదవ్, నాగరాజు, బుచ్చిరాములు, నగేశ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జేడీ కుమార్ పాల్గొన్నారు.


చేవెళ్ల బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న శ్రీరాములుయాదవ్ తదితరులు

హైదరాబాద్ పాతబస్తీ అభివృద్ధి ఎంఐఎంతోనే సాధ్యం: ఎమ్మెల్యే బలాల


ఓటర్‌ను ఎంఐఎంకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి ఎంఐఎంతోనే సాధ్యమని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఎంఐఎం ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా చావునీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పాతబస్తీలో కనీస మౌలిక సదుపాయాలకే అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పాతబస్తీలో అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంఐఎం నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో చావునీ డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్ మూన్, ఎంఐఎం నాయకులు సయ్యద్ అలీం, అనాస్ ఖాద్రీ, సైఫుద్దీన్ షఫీ, అబ్రార్ పాల్గొన్నారు.

ఇన్ఫర్మేషన్ కాలనీ కార్యాలయం ప్రారంభం


ఇన్ఫర్మేషన్ కాలనీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : హయత్‌నగర్ డివిజన్ ఇన్ఫర్మేషన్ కాలనీవాసులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న కార్యాలయాన్ని డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం అన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి శోభన్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఫణికుమార్, కృష్ణబాబు, రాం రెడ్డి, కుమార్, సత్యనారాయణ, బీజేపీ నేతలు శ్రీను, కాలనీవాసులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల విద్యావ్యాపారాన్ని నియంత్రించాలి

● తెలంగాణ క్రాంతి దళ్ నేత కరుణాకర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కళాశాలల విద్యావ్యాపారాన్ని నియంత్రించాలని తెలంగాణ క్రాంతిదళ్ నేత కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్పొరేట్ కళాశాలల విద్యావ్యాపారాన్ని నిరసిస్తూ శుక్రవారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లోని పలు కార్పొరేట్ కళాశాలలకు వెళ్లి నిర్వాహకులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఫలితాలు విడుదల కాకముందే కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అంతే కాకుండా తరగతులు కూడా నిర్వహిస్తున్నారని ఆయన చెప్పారు. ఇలాంటి కార్పొరేట్ కళాశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ క్రాంతిదళ్, తెలంగాణ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకులు వీరమల్ల కరుణాకర్‌గౌడ్, ధీరజ్, సుధాకర్‌గౌడ్, సురేష్‌కుమార్, మేదిరాజు రవి, జయకృష్ణ, శ్రీనివాస్‌ముదిరాజ్, రమేష్‌గౌడ్, శ్రీధర్, గణపతి పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఓట్లను దండుకునేందుకు కుట్ర

● హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత


మాట్లాడుతున్న హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత, పక్కన కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఓట్లను దండుకోవడానికి ఒవైసీ బ్రదర్స్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ కుట్ర పన్నుతున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీ లత విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆజంపుర డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి, బీజేపీ మీడియా కో కన్వీనర్ లింగాల హరిగౌడ్‌తో కలిసి ఆమె ఓటర్ల ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసారి బీజేపీకి ఓటు వేసి మోదీ నాయకత్వాన్ని బలపరచి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాతబస్తీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రతి సారి ఎన్నికల్లో ఒవైసీ బ్రదర్స్ తమ ప్రసంగాలు, మాటల్లో ఓ వర్గాన్ని రెచ్చగొట్టి ఓట్లను దండుకునే కుట్ర పన్నుతున్నారని, ఈసారి వాటిని అడ్డుకోవడానికి మైనార్టీలతోపాటు మైనార్టీయేతరులకు మోదీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఇంటింటి ప్రచారం చేస్తున్నట్లు ఆమె వివరించారు. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలతో దోస్తీ చేశారు తప్ప హైదరాబాద్ అభివృద్ధి, అక్కడి ప్రజల సంక్షేమం కోసం ఏనాడు ఎంఐఎం పనిచేయలేదని మాధవీ లత విమర్శించారు. మేనిఫెస్టోలోని అంశాలపై ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసా కల్పించేలా పదేళ్ల మోదీ పాలన సాగిందన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలందిస్తా

● మల్కాజిగిరి స్వతంత్ర అభ్యర్థి శ్రీవైష్ణవీ ప్రసాద్


నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న మల్కాజిగిరి ఎంపీ స్వతంత్ర అభ్యర్థి శ్రీవైష్ణవీ ప్రసాద్

కొత్తపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలకూ అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిస్తానని మల్కాజిగిరి ఎంపీ స్వతంత్ర అభ్యర్థి శ్రీవైష్ణవీ ప్రసాద్ (పెండ్యాల శేషసాయి ప్రసాద్) స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కొత్తపేట మారుతీనగర్‌లోని భాగ్యనగర్ బ్రాహ్మణ సమాజ భవనం నుంచి అభిమానులు, శ్రేయోభిలాషులతో కలిసి నామినేషన్ వేసేందుకు మల్కాజిగిరిలోని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీస్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. మోహన్‌నగర్ హరిహరక్షేత్రంలోని వేంకటేశ్వరాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ర్యాలీ కొత్తపేట, మోహన్‌నగర్, న్యూనాగోల్, సమతాపురికాలనీ మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన అందివ్వడానికి ప్రజల మనిషిగా మరింత సేవ చేసేందుకు రాజకీయ రంగంలోకి అడుగుపెట్టానన్నారు. అన్ని వర్గాల ప్రజలూ ఆశీర్వదిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అర్హులందరికీ ఉచిత విద్యా, వైద్యం అందించడానికి తనవంతు సహకరిస్తానని పేర్కొన్నారు. నగరంలోని పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, మోహన్‌నగర్, న్యూనాగోల్ తదితర పరిసర కాలనీల ప్రజలూ ఆయనకు సంఘీభావం తెలిపారు. ర్యాలీలో జంట నగరాల బ్రాహ్మణ సంఘాల సమాఖ్య పూర్వ అధ్యక్షులు వారణాశి వంశీ, తులసీ శ్రీనివాస్, వక్కలంక శ్రీనివాసరావు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు దుడ్డు సుబ్రహ్మణ్యం, గొల్లపూడి రాజేశ్వరరావు, ప్రబల విశ్వనాథం, కైలాస్, కర్ర సుబ్బారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 19 : రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్, బీరప్పగడ్డ వద్ద నివాసం ఉండే పర్వతం ధనంజయ(40) సరూర్‌నగర్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ధనంజయ భార్య, ఇద్దరు కుమారులతో కలిసి ఘట్‌కేసర్‌లోని బంధువుల ఇంటికి పుట్టినరోజు వేడుకలకు వెళ్లాడు. ముగించుకొని గురువారం రాత్రి 11:30 లకు భార్య ఇద్దరు కుమారులతో కలిసి ఉప్పల్‌లోని ఇంటికి వస్తుండగా పోచారం మున్సిపల్, అన్నోజిగూడ డీ-మార్ట్ వద్దకు రాగానే కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధనంజయకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. చిన్న కుమారుడికి తీవ్రగాయాలు కాగా, భార్య, పెద్ద కుమారుడికి స్వల్పగాయాలు అయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్

సంతోష్‌నగర్: ఆర్థిక లావాదేవీల కారణంగా ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులను ఐఎస్‌సదన్ పోలీసులు అరెస్టు చేసి ఒక కత్తి, ఐరన్‌రాడ్, ఒక ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బడంగ్‌పేట్‌కు చెందిన సాయికుమార్‌ను శ్రీశైలం అతని కుమారులు కట్టెలు, కత్తులతో దాడి చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయగా నిందితులను శుక్రవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

టెక్నికల్ ఫెస్ట్‌లు ప్రతిభను వెలికితీస్తాయి

● జేఎన్‌టీయూహెచ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ మురళీకృష్ణ

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో 'టెక్ రీసోనెన్స్-2క24' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూహెచ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, ప్రొఫెసర్ మురళీకృష్ణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్ ఫెస్ట్‌లు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా ఫెస్ట్‌లో పాల్గొనాలని సూచించారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ సంస్థ సీనియర్ మేనేజర్ డాక్టర్. అంజనేయశర్మ, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్. శైలజాదొనెంపూడి, ఇన్ఫోసిస్ మేనేజర్ నివాస్‌తో పాటు అవంతి గ్రూప్స్ డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ రాంచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, పీఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాత నేరస్థుడి అరెస్ట్

● మూడు బైక్‌ల స్వాధీనం


నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న బైక్‌లు

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మెదక్ జిల్లా జోగిపేటకు చెందిన బి.శ్రీనివాస్(45) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి దిల్‌సుఖ్‌నగర్ కోదండరామ్‌నగర్‌లో నివాసం ఉంటూ, బైక్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. అయితే సులువుగా డబ్బులు సంపాదించడం కోసం దొంగతనాలను ఎంచుకున్నాడు. రాత్రి వేళల్లో ఇళ్ల ముందు పార్క్ చేసిన బైక్‌లను దొంగిలిస్తున్నాడు. ఈ క్రమంలో పీ అండ్ టీ కాలనీ, వీవీనగర్, బాపునగర్ కాలనీల్లో ఇళ్ల ముందు పార్క్ చేసిన మూడు బైక్‌లను అపహరించాడు. కేసు నమోదు చేసుకున్న సరూర్‌నగర్ పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. శుక్రవారం కోదండరామ్‌నగర్ నుంచి వెళ్తున్న శ్రీనివాస్ ఆనవాళ్లపై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనానికి పాల్పడ్డట్లు అంగీకరించాడు. దీంతో అతని వద్ద నుంచి లక్షన్నర విలువ చేసే మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు గతంలో జోగిపేటలో రెండు దొంగతనాలకు పాల్పడ్డట్లు విచారణలో తేలింది. కేసు విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన క్రైం ఎస్ఐ సునీల్‌రెడ్డి బృందాన్ని ఇన్‌స్పెక్టర్ అభినందించారు.


రోడ్డుపై ధర్నా చేస్తున్న బాలాజీనగర్ వాసులు

రెండో రోజూ బాలాజీనగర్ వాసుల ఆందోళన

సైదాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ బాలాజీనగర్‌లో నూతన రోడ్డు నిర్మాణ పనుల అవకతవకలపై చర్యలు చేపట్టాలంటూ కాలనీవాసులు రెండో రోజు శుక్రవారం ధర్నా చేపట్టారు. కాంట్రాక్టర్ కొంత మందికి లాభం చేకూర్చేలా ఇంటి ర్యాంపులను కూల్చివేశారని ఆరోపించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని తెలిపారు. సదరు కాంట్రాక్టర్ పనులు అర్థాంతరంగా నిలిపివేసి పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్య తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు నరేందర్‌యాదవ్, కరుణాకర్‌రెడ్డి, దిలీప్, ప్రతాప్, బాబులాల్, శేఖర్‌రెడ్డి, సుందర్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, అఖిల బ్రాహ్మణ ఫెడరేషన్ కార్యదర్శి తులసి శ్రీనివాస్ ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడిగా ఉన్న తులసి శ్రీనివాస్ గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్‌లో చేరారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తిరిగి సొంతగూటికి చేరుతున్నట్లు వెల్లడించారు. పార్టీలో చేరిన అనంతరం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ పాలకమండలి సభ్యుడు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి రోహిత్ చౌదరిని కలిశారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786